# కల్పన

-వాణిశ్రీ

ఇరవై ఏళ్ల తరువాత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నాగార్జునసాగర్ వచ్చాడు అరవిందస్వామి. ఇరవై ఏళ్లక్రితం జూనియర్ ఇంజనీర్‌గా అక్కడ పని చేసాడు. చార్జి తీసుకున్న తరువాత తెలిసినవాళ్లు కనిపిస్తారేమోనని హిల్‌కాలనీలో బజార్‌లో తిరిగాడు.

షణ్ముగం హోటల్‌లో కాఫీ తాగుతుంటే అక్కడ మధుబాబు కనిపించాడు. "ఒరేయ్ స్వామీ" అని పలకరించాడు.

పరికించి చూస్తేగానీ మధుబాబుని గుర్తు పట్టలేకపోయాడు. బాగా లావయ్యాడు. పొట్ట ముందుకు పొడుచుకొచ్చింది. ఒకప్పుడు తన రూమ్మేట్ మధుబాబు.

"ఏంట్రా మధూ ఇలా చిక్కిపోయావేం?" అని పరిహాసాలాడాడు అరవిందస్వామి.

"ఏడ్చావులే నీ జోకులు ఆపు. ఎప్పుడొచ్చావు?'' అని అడిగాడు.

తను ప్రమోషన్ మీద వచ్చి చార్జి తీసుకున్నానని చెప్పాడు. ఇద్దరూ చాలాసేపు మాట్లాడుకున్నారు. మధుబాబు అక్కడే జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు.

కాసేపైన తరువాత అరవిందస్వామిని తన క్వార్టర్‌కి తీసుకెళ్లాడు. భార్యాపిల్లలకు పరిచయం చేసాడు. రాత్రి డిన్నర్ అక్కడే చేసాడు.

అరవిందస్వామి బ్రహ్మచారి కావడంతో అతని క్వార్టర్‌లో మందు పార్టీలు మొదలయ్యాయి.

ఆఫీసులో కొలీగ్స్ పార్టీ ప్రపోజ్ చేసినప్పుడల్లా మధుబాబు తన క్లోజ్‌ఫ్రెండ్ అని ఫోన్ చేసి పిలుస్తుండేవాడు.

ఒకరోజు అంతా మందు పార్టీలో ఉన్నప్పుడు సుందరరెడ్డి అరవిందస్వామిని అడిగాడు "సార్! మీరెందుకు పెళ్లి చేసుకోలేదు''

అరవిందస్వామి దీర్ఘంగా నిట్టూర్చాడు. సుందర్‌రెడ్డికి కొంచెం మందు ఎక్కువైంది. అతనికి మందు పడితే ఎక్కడలేని హుషారు వచ్చేస్తుంది. తన పై ఆఫీసర్ అయిన అరవిందస్వామిని పర్సనల్ విషయం అడిగాడంటే అది మందు మహత్యమే.

తోటి కొలీగ్స్ సుందరరెడ్డిని మందలించారు.

"నీకెందుకోయ్ పర్సనల్ విషయాలు. హాయిగా ఎంజాయ్ చేయాలిగానీ'' అన్నారు.

"ఫర్వాలేదులే. కుతూహలంకొద్దీ అడిగాడు. తప్పేముంది?'' అన్నాడు అరవిందస్వామి.

మధుబాబు వైపు చూసి చిరునవ్వు నవ్వి మొదలుపెట్టాడు.

"నాకిప్పుడు నలభై ఐదు దాటాయి. అంటే పెళ్లి వయసు దాటిపోయింది'' అన్నాడు.

"భలేవారే సార్. పెళ్లికి వయసేమిటి? అరవై ఏళ్ల వాళ్లు కూడా పెళ్లిమీద పెళ్లి చేసుకుంటూ వుంటే...?'' అన్నాడు గంగాధరం అతన్ని ఉత్సాహపరుస్తూ.

"అది వేరులే. నేను భగ్నప్రేమికుడివి. కల్పనను మర్చిపోలేక పెళ్లి మానుకున్నాను'' అన్నాడు అరవిందస్వామి విషాద వదనంతో.

"గురూగారిది లవ్ ఫెయిల్యూర్ అన్నమాట. వెరీ ఇంట్రెస్టింగ్. సార్... మీకు అభ్యంతరం లేకపోతే మీ లవ్ స్టోరీ వినాలని వుంది'' అన్నాడు సుందరరెడ్డి ఉత్సాహంగా గ్లాస్ ఖాళీ చేసి.

అరవిందస్వామి తన ప్రేమ కథ చెప్పడం ప్రారంభించాడు.

"నేను తొలిసారి ఇక్కడే జూనియర్ ఇంజనీర్‌గా జాయినయ్యాను. అప్పుడు బాగా అందంగా ఉండేవాడిని. నాదంతా మా అమ్మ పోలిక. అందుకే ఎర్రటి రంగొచ్చింది.

"ఇప్పుడు కూడా అందంగానే ఉన్నారు సార్. కాకపోతే కొంచెం లావుగా ఉన్నారు సీరియర్ హీరోలా'' అని సుందరరెడ్డి పొడుగుతూ ఉండగా అరవిందస్వామి అడ్డు తగిలాడు.

"నన్ను చెప్పనీ. మధ్యలో నీ కామెంటరీ వుంటే ఈ స్టోరీ పూర్తికాదు'' అన్నాడు.

"ఏయ్ సుందర్రెడ్డీ! నువ్వు మందు ఆపి తిండిమీద పడు నోరు మూసుకుని'' అని గంగాధరం మందలించాడు.

"నోరు మూసుకుని ఎలా తినాలోయ్'' అని తన జోక్‌కి తనే నవ్వుకున్నాడు సుందరరెడ్డి.

"సార్! మీరు ఆపకండి.''

అరవిందస్వామి కొనసాగించాడు.

"నేను క్లబ్‌లో షటిల్ ఆడుతూ ఉండగా మా ఆఫీసు మేనేజర్ సూర్యప్రకాశరావు వచ్చాడు. ఆయన షటిల్ ఆడడానికి వచ్చాడేమో అనుకుని 'రండి సార్. మీరు షటిల్ ఆడతారా?' అని అడిగాను. 'నీతో తీరిగ్గా మాట్లాడాలని వచ్చాను స్వామీ' అన్నాడు. ఏదైనా డబ్బు అవసరం ఏమో అనుకున్నాను.

నేను బ్యాచిలర్ కాబట్టి నాకు జీతంలో డబ్బు మిగులుతుందని కొందరు అపోహ పడుతుంటారు. అయితే ఆయన చెప్పింది విని నేను ఆశ్చర్యపోయాను. నేను నాటికలో హీరో వేషం వేయాలిట. నావల్లకాదనీ, అటువంటి ఇంట్రెస్టు లేదనీ మొత్తుకున్నా వినలేదు. 'నీవల్ల అవుతుంది. నువ్వు హీరోగా సూటవుతావు. నేను నిన్ను నటుడిగా తీర్చిదిద్దుతాను' అని వెంటపడ్డాడు. చివరకు తప్పలేదు.

నెలరోజులు రిహార్సల్ చేయించాడు. నేను కూడా పట్టుదలగా వెళ్తున్నాను. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నాటికను ఆడిటోరియంలో వేసాం. ఇక అక్కడ్నుంచి అప్పుడప్పుడు నాటికలు, నాటకాలు వేస్తున్నాం. నాకు హీరోగా గుర్తింపు వచ్చింది.

ఒకరోజు నేను హడావుడిగా రిహార్సల్స్‌కి

వెళ్తుంటే సాయంకాలం క్వార్టర్ ముందు గేటు దగ్గర నిలబడ్డ యువతి 'ఏమండీ' అని పిలిచింది.

నన్ను కాదేమో నా వెనుక ఎవరైనా వస్తున్నారేమో అని వెనక్కి తిరిగి చూసాను. ఎవరూలేరు.

ఆమె నవ్వి "మిమ్మల్నేనండీ" అంది.

నేను ఆగి "ఏమిటండీ" అన్నాను.

"రోడ్డుమీద నిలబడి ఏం మాట్లాడుకుంటాం. లోపలకు రండి" అంటూ గేటు తీసింది.

నేను టైమ్ చూసుకున్నాను. ఆరు దాటింది. మా డైరక్టర్‌కి సమయపాలన ఎక్కువ. చెప్పిన టైమ్‌కి రాకపోతే చిందులు తొక్కుతాడు.

"ఇప్పుడు కాదండీ. నేను ఆడిటోరియమ్‌కి వెళ్లాలి. నాటకానికి రిహార్సల్స్ జరుగుతున్నాయి. నాకోసం అంతా ఎదురు చూస్తుంటారు" అన్నాను.

"అబ్బే... ఎక్కువసేపు మిమ్మల్ని విసిగించను. నేను మీ అభిమానిని. ఐదు నిముషాలు కూర్చుని వెళ్లండి" అని అభ్యర్థించింది.

నేను బాగుండదని లోపలకు వెళ్లాను. నన్ను కూర్చోబెట్టి కాఫీ ఇచ్చి తనూ కూర్చుంది. ఇంట్లో ఎవరూలేరు.

నేను ఆ మాటే అడిగాను. అంతా పెళ్లికి వెళ్లారని చెప్పింది.

"చెప్పండి. ఏమిటి?" అన్నాను.

"నా పేరు కల్పన" అంది.


నేను తల వూపాను. ఆమె పేరు ఏదైతే నాకేమిటి అనుకున్నాను.

"నేను మీరు వేసిన నాటకాలన్నీ చూసాను. బాగా యాక్ట్ చేస్తారండీ. మీ అభిమానిని" అని నవ్వింది.

"అబ్బే... నేను పెద్దనటుడిని కాదులెండి. ఏదో మా మేనేజర్ బలవంతపెడితే వేస్తున్నాను" అంటూ ఆమెను పరీక్షగా చూసాను.

కల్పన ఎత్తుగా, ఎర్రగా ఉం కోలముఖం. కళ్లు పెద్దవి. చేపకళ్ళ వర్ణిస్తారే అలా మిలమిలా మెరు: న్నాయి.

పదినిముషాలు కూర్చుని వెళ్లిపోయాను. తరువాత మేము ఆడిటోరియంలో రిహార్సల్ వేస్తుంటే కల్పన వచ్చి ప్రేక్షకులు కూర్చునే కుర్చీలో కూర్చుంది.



మేము రిహార్సల్స్ వేస్తుంటే కొందరు సన్నిహితులు వచ్చి కూర్చోవడం మామూలే. ఐతే కల్పన నాకోసం వచ్చానని చెప్పి వచ్చి కూర్చుంది. నా పోర్షన్ రిహార్సల్స్ లేనప్పుడు నన్ను చెయ్యెత్తి రమ్మని పిలిచింది. నేను ఆమె పక్కన కూర్చుని నా పాత్ర గురించి చెప్పాను. అలా అప్పుడప్పుడు వచ్చేది.

ఒకరోజు మా డైరెక్టర్ సూర్యప్రకాశరావు నన్ను పక్కకు పిలిచి "ఏమోయ్ స్వామీ! నాగిరెడ్డి కూతురితో నీకు ఎఫైర్ ఏంటి? మానుకో. వాళ్లకి తెలిస్తే డేంజర్" అన్నాడు.

"నాగిరెడ్డి కూతురు ఎవరు?" అని అడిగాను.

"నీకోసం వస్తోందే ఆ అమ్మాయి" అన్నాడు.

నాకు అప్పుడు అర్థమయింది కల్పన నాగిరెడ్డి కూతురని. నాగిరెడ్డి అక్కడకు దగ్గర్లోని ఊరి సర్పంచ్ అనీ, సారా కాంట్రాక్టర్ అనీ వివరంగా చెప్పాడు సూర్యప్రకాశరావు.

అయితే అవేమీ నా చెవికెక్కలేదు. నేను ఏం తప్పు చేసాను? నేను నటుడిని. ఆమె నా అభిమాని. అంతేగా అనుకుని మామూలుగా ఉన్నాను.

ఒకరోజు కల్పన నన్ను నాగార్జున కొండకి వెళ్దామని ప్రపోజ్ చేసింది. ఆదివారం కాబట్టి సరేనన్నాను.

లాంచి స్టేషన్ నుంచి బయల్దేరింది. నాగార్జున కొండమీద మ్యూజియంలో శిల్పాలు చూస్తుండగా నాచేతిని గట్టిగా పట్టుకుని 'అరవింద్ ఐ లవ్ యూ' అంది.

నేను మైకంలో పడిపోయాను. మా డైరెక్టర్ హెచ్చరికలు ఏమీ గుర్తుకు రాలేదు. అంత అందమైన అమ్మాయి చొరవగా 'ఐ లవ్ యూ' అని చెప్తుంటే నేను రెస్పాండ్ కాకపోవడం బాగుండదు అనిపించింది. 'ఐ టూ లవ్ యూ' అన్నాను.

కల్పన నన్ను బుగ్గమీద ముద్దు పెట్టుకుంది. కొందరు యాత్రికులు మమ్మల్ని చూసి నవ్వుకున్నారు.

అలా ఇద్దరం ప్రేమించుకుంటున్న విషయం హిల్‌కాలనీలో అందరికీ తెలిసింది. ఇక్కడ కాలనీల సంగతి తెలుసుగా. పల్లెటూళ్ల వంటివే. మా విషయం ఓపెన్ సీక్రెట్ అయింది.

కల్పన నన్ను వాళ్లింటికి వచ్చి మాట్లాడమంది. ఎప్పటికైనా నేను వెళ్లవలసిందే కదా అని నేను మా డైరెక్టర్ సూర్యప్రకాశరావును వెంటబెట్టుకుని వెళ్లాను.

నాగిరెడ్డి చెయ్యెత్తు మనిషి. నల్లగా, పెద్ద మీసాలతో ముఖాన కుంకుమ బొట్టు పెట్టుకుని ఉన్నాడు. అప్పుడే పూజ ముగించినట్లున్నాడు. మాకు కొబ్బరిముక్కలు, అరటిపళ్లు ప్రసాదం పెట్టాడు. సూర్యప్రకాశరావు నాగిరెడ్డికి పరిచయమే.

నాటకాలు వేయడానికి నాగిరెడ్డి ఆర్థిక సహాయం అందిస్తుంటాడు. మేము చందా కోసం వచ్చామని అనుకున్నాడు.

"రావుగారూ! కొత్త నాటకం ఏమైనా వేస్తున్నారా?" అని అడిగాడు నాగిరెడ్డి.

"ప్రస్తుతం రిహార్సల్స్ జరుగుతున్నాయి. 'దేవుడూ నిద్రలే' అనే నాటకం ఇంకొక నెలలో వేస్తాం" అన్నాడు సూర్యప్రకాశరావు.

"సర్లెండి. హీరోయిన్ ఏలూరు నుంచి వస్తోంది కదా. ఆమె ఖర్చులు నేనిస్తాలెండి" అన్నాడు నాగిరెడ్డి.

"మేము వచ్చింది అందుకుకాదు" అని నేను వాళ్లమ్మాయి కల్పన ప్రేమించుకుంటున్న విషయం చెప్పాడు.

నేను జెఇగా పని చేస్తున్నానని, బుద్ధిమంతుడని నా గురించి పొగిడాడు సూర్యప్రకాశరావు.

నాగిరెడ్డి షాక్ తిన్నట్లు అయిపోయాడు. ముఖం జేవురించింది. నావైపు ఎగాదిగా చూసాడు.


"సారీ రావుగారూ... మా మేనల్లుడు స్టేట్స్‌లో ఉన్నాడు. కల్పనను అతనికివ్వాలని ఎప్పుడో డిసైడ్ చేసాం" అన్నాడు నాగిరెడ్డి.

"కానీ మీ అమ్మాయి..." అని సూర్యప్రకాశరావు చెప్పబోతుండగా నాగిరెడ్డి అడ్డుపడ్డాడు.

"ప్లీజ్... ఈ విషయంలో మీరు జోక్యం చేసుకోకండి. మిస్టర్ అరవిందస్వామి! మా అమ్మాయిమీద ఆశ పెట్టుకోకు. ఆమె వివాహం డిసైడైపోయింది" అని సీరియస్‌గా చెప్పాడు.

ఇక మేం చేసేదేంలేక వచ్చేసాం. సూర్యప్రకాశరావు నన్నే తప్పుబట్టారు.

"నేను ముందే చెప్పానుగా ఆ అమ్మాయితో ఎఫైర్ పెట్టుకోవద్దని. ఇప్పుడేమైంది? వాళ్లు అంత త్వరగా ఇంటర్‌కాస్ట్ మేరేజ్‌కి ఒప్పుకోరు. ఇక



## ఇంతే మరి!

షేక్స్‌పియర్ పుట్టిన తేదీ, మరణించిన తేదీ ఒక్కటే? ఆశ్చర్యంగా ఉంది కదూ. 23 ఏప్రిల్ 1564లో పుట్టిన షేక్స్‌పియర్, 1616 సంవత్సరం ఏప్రిల్ 23న మరణించాడు.

## నోరూరించే బిస్కెట్

బిస్కెట్ అంటే రెండుసార్లు వేయించబడినది అని అర్థం. ఇది ఫ్రెంచ్ పదం. ఓడల్లో దూరప్రయాణాలు చేసేవాళ్లకోసం మొట్టమొదట తయారు చేయబడిన ఈ బిస్కెట్ బహుళ జనాదరణకు నోచుకున్న విషయం అందరికీ తెలుసు.

## ఆల్ ఇండియా రేడియో

మన దేశంలో ఆకాశవాణి ప్రసార కేంద్రం మొదటిసారిగా బొంబాయిలో 1929, జూన్ 23న నెలకొల్పబడింది. ఆల్ ఇండియా రేడియో అనే పేరు మాత్రం 1930లో వాడుకలోకి వచ్చింది.

-శ్రేష్మాశ్రీరామ్

ఆ అమ్మాయికి దూరంగా ఉండు. నేను ఎందుకు చెబుతున్నానో అర్థం చేసుకో'' అన్నాడు.

"తర్వాత ఏమైంది సార్? నాగిరెడ్డి తన కూతురికి మేనల్లుడితో పెళ్లిచేసి అమెరికా పంపేసాడా?'' ఆత్రంగా అడిగాడు సుందర్రెడ్డి.

అరవిందస్వామి నిట్టూర్చాడు.

"రౌండ్స్ పూర్తయ్యాయికదా. ఫుడ్ తిని తర్వాత చెప్పుకుందాం. ప్రస్తుతానికి ఇంటర్వెల్'' అని లేచాడు అరవిందస్వామి.

"లవ్ స్టోరీలన్నీ ఫెయిల్యూర్ అయ్యేవే. లేకపోతే అవి లవ్‌స్టోరీలు ఎలా అవుతాయి అని నేను సరిపెట్టుకున్నాను. మా డైరెక్టర్ సలహా ప్రకారం కల్పనకు దూరంగా మసలసాగాను.

ఐతే కల్పన సమాధానపడలేదు. తండ్రికి ఎదురు తిరిగింది. నాగిరెడ్డి కూడా పట్టుదలతో ఉన్నాడు. ఈ పెళ్లి ససేమిరా జరగదన్నాడు. కల్పన అక్క దేవకి చెల్లెల్ని కొన్నాళ్లు తనతోపాటు వుంచుకుంటానని హైదరాబాద్ తీసుకెళ్లింది. ఐతే ఆమె చెల్లెలికి సపోర్టుగా నిలబడింది. కల్పన హైదరాబాద్ వెళ్లాక వారం తరువాత నాకు ఫోన్ చేసింది. ఆఫీసుకు సెలవు పెట్టి రమ్మంది.

మా అక్క ఆర్యసమాజ్‌లో మన పెళ్లికి ఏర్పాటు చేస్తోంది. పెళ్లయ్యాక మా నాన్న కూడా ఏమీ చేయలేడు, అంతగా కావాలంటే నువ్వు నాగార్జున సాగర్ నుంచి హైదరాబాద్‌కి ట్రాన్స్‌ఫర్ చేయించుకోవచ్చు అన్నది. నేను ఎవరికీ విషయం చెప్పకుండా హైదరాబాద్ వెళ్లి కల్పనను కలుసుకున్నాను. వాళ్ల అక్క దేవకి ఆర్య సమాజానికి తీసుకువెళ్లి పెళ్లి ఏర్పాట్లు చేస్తోంది. ఇక తెల్లవారాక మా పెళ్లి. మేము ఆర్యసమాజానికి వెళ్లేసరికి అక్కడ నాగిరెడ్డి మనుషులతో ప్రత్యక్షమయ్యాడు. ఎలా తెలిసిందో మా పెళ్లి సంగతి. వచ్చేసి అడ్డుపడ్డాడు.

పెద్ద గొడవైంది. నాగిరెడ్డికి బిపి రెయిజైపోయి పెద్దగా కేకలు పెడుతూ రివాల్వర్‌తో నన్ను బెదిరిస్తుంటే కల్పన భయపడిపోయింది. మూర్ఖుడైన తండ్రి ఆవేశంతో నన్ను చంపుతాడని హడిలిపోయింది. తండ్రి కాళ్లు పట్టుకుని నన్ను చంపవద్దని వేడుకుంది.

బావనే పెళ్లి చేసుకుంటానని ఒప్పుకుంది. నాగిరెడ్డి నన్ను మెడ పట్టుకుని గెంటేసాడు.

"వెరీ ఇంటరెస్టింగ్ సార్ మీ లవ్ స్టోరీ'' అని చప్పట్లు కొట్టాడు సుందర్రెడ్డి.

"నాకు నిద్రొస్తోంది. ఇంటికెళ్తాను'' అన లేవబోయాడు మధుబాబు.

"ఇంత చీకట్లో ఇంటికెళ్లి ఏం చేస్తావు? దారిలో పాములు తిరుగుతుంటాయి. చాలా ప్రమాదం. పడుకుని పొద్దున వెళ్దువులే'' అన్నాడు అరవిందస్వామి.

"అయిపోయిందా సార్''

"కొంచెం వుంది. కల్పన వాళ్ల బావను పెళ్లి చేసుకోలేదు. ఆమె పెళ్లి చేసుకుని సుఖంగా ఉంటే నేనూ మరో అమ్మాయిని పెళ్లి చేసుకుని ఉండేవాడినేమో. కానీ కల్పన ఆత్మహత్య చేసుకుంది. అంతే... నేను ఆమెనే తల్చుకుంటూ బ్రహ్మచారిగా ఉండిపోయాను'' ముగించాడు అరవిందస్వామి.

అంతా ఇళ్ళకు వెళ్లిపోయారు.

అరవిందస్వామి, మధుబాబు మిగిలిపోయారు. ఇక నిద్రపోవడానికి సిద్ధమయ్యారు.

"నువ్వు మీ నాన్న పోయాక కుటుంబ భారం మీద వేసుకుని తమ్ముళ్లని చదివించి, చెల్లెలి పెళ్లిచేసి ముదిరిపోయి బ్రహ్మచారిగా ఉండిపోయావు. మరి ఎవరో కల్పనను ప్రేమించి భగ్నహృదయుడైపోయావని కల్పించి ఎందుకు చెప్పావు? వాళ్లంతా నిజమనుకుని అందరికీ చెప్పి ప్రచారం చేయరూ? నువ్వలా చెప్పడం నాకేం నచ్చలేదు'' కొంచెం కోపంగా అన్నాడు మధుబాబు.


అరవిందస్వామి పకపకా నవ్వాడు.

"నేను నిజం చెప్తే వాళ్లంతా నన్ను త్యాగరాజు అని ఎగతాళి చేస్తారు. ఇంకా నన్ను నపుంసకుడని కూడా ప్రచారం చేస్తారు. దానికన్నా లవ్‌స్టోరీ నయం కదా. నామీద సానుభూతి వుంటుంది. అందరూ నావంక జాలిగా చూస్తారు. అది నాకిష్టంలేదు. అందుకే అలా చెప్పాను. బాగుందా నేను కల్పించి చెప్పిన కల్పన లవ్ స్టోరీ'' అన్నాడు.

"ఎవరికైనా ప్రొడ్యూసర్‌కి చెప్పు. సినిమా తీస్తాడేమో'' అని నవ్వి దుప్పటి ముసుగుపెట్టాడు మధుబాబు.

☆

## గ్రేట్ పిరమిడ్



229 మీటర్ల వెడల్పు, 147 మీటర్ల ఎత్తు వున్న పిరమిడ్‌ను క్యాంప్స్ ప్రభువు ఈజిప్టులో నిర్మించాడు. ఒక లక్షమంది కార్మికులు 20 సంవత్సరాలపాటు శ్రమకోర్చి నిర్మించారీ పిరమిడ్‌ను.

## చీట్ల పేకల పుట్టుక

1932లో చీట్లపేకలోని 52 పేకలు ఏర్పడ్డాయి. మొదట్లో మన దేశంలో కనిపెట్టబడిన ఈ చీట్లపేకలో దశావతారాలను సూచించే పది పేకలు మాత్రమే ఉండేవి. ఋతువులోని 13 వారాలను సూచించేందుకు 13 రకాలు, నాలుగు ఋతువులను సూచించేందుకు నాలుగు జాతులు, రాత్రింబవళ్లను సూచించేందుకు ఎరుపూ, నలుపులు, సంవత్సరంలోని 52 వారాలను సూచించేలా 52 పేకలను కనిపెట్టిన వ్యక్తి పేరు గంగోమూర్.

-ఎస్.ఎల్.ఎస్.ఎమ్